# పూలవాన కురిసేనా?

— బుద్ధి యజ్ఞమూర్తి

ఆమె కళ్ళ ముందు జ్యోతిలా వెలుగుతోంది భార్గవకి. కన్ను తెరిచినా ఆమె మూసినా ఆమె. ఇంట్లోనూ ఆమె. ఇంటి బయటా ఆమె. తినే అన్నంలోనూ ఆమె తాగే నీళ్ళలోనూ ఆమె. మెలకువలోనూ ఆమె నిద్రలోనూ ఆమె. ఆలోచనల నిండా ఆమె... ఆమె! మరవలేకపోతున్నాడు భార్గవ ఆనాటి సంఘటనను. ఎంత తీయని రోజది. ఎంత మధురానుభూతినిచ్చిన రోజది. కమ్మని కలలా మిగిలిన రోజది. జీవితాంతం హృదయంలో స్థిరపడిపోయే రోజది. భార్గవ ఆనాటి అనుభూతి తాలూకు ఉద్వేగాన్ని తట్టుకోలేకపోతున్నాడు. ఎవరికైనా తన హృదయనివేదనను చెప్పుకోవాలి. లేకపోతే ఆ వేడిని తట్టుకోలేడు. వేణుగోపాల్ గుర్తుకొచ్చాడు. ఆలస్యం చేయకుండా కాగితాలు ముందేసుకొని ప్రారంభించాడు.

వేటపాలెం,
మార్చి 25, 1990.



డియర్ వేణూ!

నీకు ఉత్తరం రాసి దాదాపు మూడు నెలలు గడిచిపోయాయి. ఆ ఉత్తరంలో నేను రాయాలనుకున్న ఓ కథ రాయలేకపోయాను. తిరిగి దాన్ని నీకు రాయడానికి మూడు నెలలకాలం తీసుకున్నాను. అందుకే నీకు ఇంతవరకు ఉత్తరం రాయలేకపోయాను. దీన్ని చదివాక నీ ఫీలింగ్స్ ఏవిధంగా రూపుదిద్దుకుంటాయోననే భయం ఓ వైపు ఆవహిస్తున్నా, నా మనసులోని భావోద్విగ్నతను, నా హృదయాన్ని దోచుకున్న 'ఆ అమ్మాయి' తాలూకు జ్ఞాపకాన్ని నా ప్రాణమిత్రుడవైన నీ ముందు పరచడానికి ఇక నాకేమీ సంకోచం లేకుండా చేసుకోగలిగాను.

వేణూ! నీ పెళ్ళిరోజు... ఆ రోజు రాత్రి నా కళ్ళ ముందు ఇప్పుడు మెదుల్తూనే ఉంది. ఇప్పుడే కాదు అనుక్షణం కదలాడుతూనే ఉంది. ఎందుకంటే ఆ అమ్మాయిని తొలిసారిగా గమనించిందప్పుడే. మెరుపు కన్యలాగా ధగధగలాడుతున్న ఆమె అందం నన్ను విచలితుడిని చేసింది. ఆమె వెలువరుస్తున్న కాంతుల ముందు పెళ్ళి పందిట్లో అమర్చిన ట్యూబ్ లైట్లు వెలవెల బోయాయనిపించింది. అప్పుడే ఓ విషయం గమనించాను. కేవలం నా ఒక్కడి దృష్టేకాదు అక్కడికొచ్చిన ప్రతి మగాడి దృష్టీ ముసలాళ్ళతో సహా ఆమె మీదే ఉంది. నాకు వాళ్ళందరి మీదా ఎందుకనో పట్టరాని కోపమొచ్చింది. అది నా స్వార్థమైనా, ఆక్షణంలో ఆమెందుకో నా స్వంతమనిపించింది. నా స్వంతమైన ఆమెను అంతమంది కళ్ళు గుచ్చి గుచ్చి చూడటం నేను సహించలేకపోయాను. అయినా నేనేం చేయగలను? వాళ్ళ చూపును ఆమె నుండి మరల్చడం నావల్లేమవుతుంది? నాకేమో పాలుపోలేదు. చేసేదేమీ కనుపించలేదు. నాకో మహత్తర శక్తి తోడైతే వాళ్ళ కళ్ళు ఆమె మీద పడకుండా ఆమె చుట్టూ ఓ పొరను అడ్డువేద్దును. లేకపోతే వాళ్ళ దృష్టే అసలామెమీద పడకుండా చేద్దును. కానీ వాస్తవంలో అవేమో జరగని పనులే. వాళ్ళను తిట్టుకోడం తప్ప ఏమీ చేయలేకపోయాను.

ఎవరు గమనించారో లేదో మిమ్మల్ని ఫోటో తీస్తూ ఆమెనో స్నాప్ తీశాను. ఆ ఫోటో ఇప్పుడు భద్రంగా నా వద్దనే ఉంది. ఎంత అందంగా ఉందో ఈ ఫోటోలో ఆమె. ఆ ఫోటోను నేను ముద్దుపెట్టుకోలేదింతవరకు ఆ ఫోటో నా హృదయంమీదే ఉంచుకుంటున్నాను. దాని స్థానమక్కడే!

పెళ్ళయ్యాక నేను వెళ్తానంటున్నా భోజనం చేసి వెళ్ళాల్సిందేనని పట్టుపట్టావు. తప్పించుకోవడానికి తగిన కారణం కనుపించక భోజనానికి కూర్చున్నాను. అప్పుడు పెద్దగా ఎవరూ లేరు. పెళ్ళి విందు తర్వాతిరోజు కావున మీ బంధువుల్లోని అతిముఖ్యమైన వాళ్ళు మాత్రమే ఆ రాత్రి భోజనానికి కూర్చున్నారు. నా అదృష్టమే! వడ్డన చేసేది ఆ అమ్మాయే! ఆమె నాముందు విస్తరి వేస్తూ నావైపు చూసింది. నేనూ అటువైపే చూస్తుండటంతో ఇద్దరి కళ్ళూ కలుసుకున్నాయి. నేను చిన్నగా నవ్వాను. ఆమె నవ్వలేదు. నేను నవ్వాపేశాను. "మీరు..." అంటూ ప్రశ్నార్థకంగా చూసింది. నేనెవరో ఆమెకి కూడా తెలియదని

అర్థమైంది. "నేను వేణు స్నేహితుడ్ని భార్గవ" చెప్పాను. 'అలాగా' అన్నట్లు చూసి చిరునవ్వు నవ్వింది. ఓ అద్భుతమైన సుందర దృశ్యం చూస్తున్నట్లు తన్మయంగా చూశానామెను. అయితే ఆమె నవ్వుకు కారణం మాత్రం నాకు బోధపడలేదు. కలవరంతో ఆమె అటు ఇటు చూసింది. చటుక్కున స్పృహ లోకొచ్చి చుట్టూ చూశాను తలతిప్పకుండానే. అందరూ ఇటే చూస్తున్నట్లనిపించింది. సిగ్గుతో విస్తరివంక చూపు మరల్చాను. విస్తట్లో ఆమె పదార్థాలను వడ్డిస్తోంది. కూరలన్నీ నాకిష్టమైనవిగా తోచింది. వడ్డిస్తున్నంతసేపూ తామరతూడుల్లాగా లేతగా ఉన్న ఆమె తెల్లని చేతుల వంకే చూశాను. అది సభ్యత అవునో, కాదో నాకనవసరం. కాని ఆ సమ్మోహనాకారాన్ని చూస్తుంటే నాకత్యంత ఇష్టమైన వానజల్లులో హాయిగా తడుస్తూ చిన్నపిల్లాడికి మల్లే గంతులు వేస్తున్నట్లు నా మనసు నాకే తెలియని వింతానుభూతికి లోనవుతూ వచ్చింది. ఇంతవరకు అంతటి దివ్యమంగళ రూపమేదీ నా హృదయాన్ని కదిలించి ఉండలేదు. నెమ్మదిగా భోజనం కానిచ్చాను. ఇంతవరకు నేనంతటి రుచికరమైన భోజనం చేసి ఉండలేదు. ఎప్పుడూ తినలేనంతగా తిన్నాను అదంతా ఆమె చేతుల చలువే!

భోజనాలయ్యా 'వరండాలో విశ్రాంతి తీసుకొమ్మ'ని ఆమె చెప్పింది. ఆమె అందరికీ అలాగే చెప్తున్నా నాకు మాత్రం ఆమె నామీదెందుకో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు తోచింది. ఆమెతో మాట్లాడటానికి ఏ విధంగా వీలుపడుతుందా అని యోచించాను. ఏదైనా అవకాశం అప్పటికప్పుడు కల్పించుకోడం తప్ప వేరే మార్గం అంతుపట్టలేదు. నా 'దురదృష్టమేమో ఆ కొత్త వాతావరణంలో 'అనుకోని అవసరం' దానంతటదే బయటకొచ్చింది. ఇబ్బందిగా పిలవుతూనే "ఏమండీ" అంటూ ఆమెను పిల్చాను. ఆమె గబగబా వచ్చింది. నాకేమి లోటు జరిగిందా అనే అనుమానం కావచ్చామెకు. "ఇక్కడ... ఇక్కడ టాయ్‌లెట్ ఎక్కడుందో చెప్తారా?" ఎలాగడిగానో అడిగేశాను. ఆమె నా ప్రశ్నకు నవ్వుకుందేమోనని అనుమానం వచ్చింది. ఆమె "రండి" అంటూ ముందుకు దారి తీసింది. నాకు మహా ఇబ్బంది కలిగింది. "దేవుడా ఏమిటి ఇలాంటి పరిస్థితి కల్పించావు?" అని దేవుడ్ని తిట్టుకున్నాను. ఆమె చూపించి వెళ్ళిపోయింది. నేను బ్రతుకు జీవుడా అన్నట్లుగా పోయి 'అవసరం'కానిచ్చి బయటపడ్డాను.

ఇక నాకెందుకో అక్కడ ఉండాలనిపించలేదు. అదోరకమైన 'ఇన్‌ఫీరియారిటీ కాంప్లెక్స్' నాలో తొలచడం ప్రారంభించింది. నీవెక్కడున్నావో నాకు తెలియదు. ఎవర్ని కనుక్కోవాలో అర్థంకాక అయోమయంలో కొంతసేపు కొట్టుకున్నాను. చివరికి ఇంట్లోకి అడుగుపెట్టాను. అప్పుడే ఆమె లోపల్నుండి వస్తోంది. నన్ను చూసి మళ్ళీ నవ్వింది. నా 'కాంప్లెక్స్' ఏమైందో ఏమో పందిట్లో నేనున్నట్లు నామీద పూలవాన కురిసినట్లుగా తోచింది. ఆ నవ్వును నా హృదయంలో భద్రపరచుకున్నానప్పుడే.

"వేణు ఎక్కడున్నాడో కాస్త చెప్తారా?" ఆమెనడిగాను. ఆమె అదోరకంగా నావేపు చూసింది. "ఎందుకండీ?" అంది నోటిని సున్నాలా చుడుతూ. ఆ భంగిమ చాలా బాగున్నా ఏమిటిలా అడుగుతుందని బిత్తర పోయాను. ఆమెకెందుకు ఎందుకడిగానో నేనడిగిందానికి జవాబు చెపొచ్చు గదా అన్పించింది. "చెప్పెళ్దామని" అన్నాను. "వెళ్తారా లాభం లేదండీ వేణు ఇక ఈవేళ కన్పించడు. రేపుదయమే మీకతని దర్శనం కలిగేది" చెప్పిందామె. బలవంతాన నవ్వునాపుకుంటున్నట్లు తోచింది. అంటే ఆమె నన్ను ఆట పట్టించడానికి ఉడికిస్తోందన్నమాట.

"అదేమిటండీ. మీకెలా తెలసండీ. ప్లీజ్ చెప్పరూ" అని ఆశ్చర్యంగా ముఖం పెట్టాను. ఆమె తత్తరపడింది నేనలా అడిగేసరికి. "అబ్బే ఏం లేదండీ" అంటూ "ఆ గదిలో ఉన్నాడు" అని తుర్రుమంది. నేను నవ్వుకుంటూ నీ వద్దకు వచ్చి వెళ్తానని చెప్తే నీవు ఆరోజు అక్కడే ఉండమన్నావు. అయినా నేను మళ్ళీ రేపొస్తానని చెప్పి బయటపడ్డాను. మళ్ళీ ఆమె తారసపడింది. నన్ను చూసి తప్పుకోబోయింది. "వస్తానండి" చెప్పానామెకు. ఆమె కళ్ళు చిత్రంగా తిప్పింది. నా సర్వావయవాలు ఓ క్షణం తమ విధులను ఆపి తిరిగి పనిచేస్తున్నట్లు తోచింది. అంత సమ్మోహనంగా ఉందామె ముఖం అప్పుడు.

"రేపొస్తారు కదూ" అడిగిందామె. "నేను రాకపోతే ఎలాగండీ" అని నా ప్రాముఖ్యతను నేనే చెప్పుకొని "మీ పేరు" అడిగాను. ఏమాత్రం అల్లరి పెట్టకుండా సిగ్గుపడుతూనే నెమ్మదిగా చెప్పింది. నేనక్కడనుండి కదలలేక కదిలాను. ఇల్లుదాటి రోడ్డుమీదకొచ్చి ఉత్సుకత నాపుకోలేక వెనక్కి తిరిగి చూశాను. అప్పుడు అమితంగా ఆశ్చర్యపడ్డాను. ఆమె గుమ్మంలో నిలబడి నావంకే చూస్తోంది. నేను 'టాటా' చెప్పేసి వేగంగా నడుస్తూ వెళ్ళిపోయాను. ఆ దృశ్యం నా మనోఫలకంలో ముద్రించుకుపోయింది. తర్వాతరోజు వచ్చినా ఆమె కన్పించలేదు. నేను భోజనం చేసేసి వెళ్ళిపోయాను.

ఆ మూడు నెలలు కాలంలో ఆమె ఎన్నిసార్లు గుర్తుకొచ్చిందో నాకు జ్ఞాపకం లేదు. అసలామెను మరిస్తే కదా!

అమ్మావాళ్ళు నాపెళ్ళికి త్వరపడుతున్నారు. నేను "తొందరేముంది?" అని దాటేస్తూ వస్తున్నాను. ఇక వాళ్ళను బాధపెట్టదలచుకోలేదు. వాళ్ళకి చేసుకుంటానని చెప్పేద్దామనుకుంటున్నాను. నీ ఉద్దేశ్యం కూడా కనుక్కొన్నాకే చెప్తామని నేపెట్టుగా నిర్ణయం తీసుకున్నాను. నీ నిర్ణయం నా నిర్ణయానికి సరిపోతేనే నేను అమ్మవాళ్ళకు చెప్పేది. లేకపోతే ఏమవుతుందో? ఈ సరికి ఆ అమ్మాయెవరో నీకర్థమై ఉంటుంది. కదూ నేస్తం! నాకోరిక నెరవేరుతుందంటావా? నా హృదయాన్ని దోచిన ఆమె నీ చెల్లెలు! సంధ్యారాణి!!

నీ నుండి వచ్చే ఉత్తరం అదీ నేనాశించిన విధంగా ఉండే ఉత్తరం కోసం నిరీక్షిస్తూ

నీ నేస్తం,
భార్గవ

రాసి తేలిగ్గా నిట్టూర్చాను. నాకు తెలుసు వేణు నా మాట కాదనలేడని.

## అనూ



'ఆషికి' హీరోయిన్ ప్రముఖ మోడల్ అనూ అగర్వాల్ ఒక్కసినిమా హిట్ అయి మూడు సినిమాల్లో బుక్ అయ్యేసరికి 'స్టార్' అయిపోయినట్లు ఫోజులిస్తోందట. ఈ మధ్య ఓ చిత్రం షూటింగ్ మధ్యలో ఫారిన్ ట్రిప్ పెట్టుకుని, పెద్దమొత్తం డబ్బు అర్జెంట్‌గా సర్దుబాటు చెయ్యమని నిర్మాతని ఇరకాటంలో పెట్టిందట.

